విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

బుధవారం 21 మే 2025 8 పేజీలు

నేడు సీపీఐ నగర సమితి సమావేశం

విశాలాంధ్ర–విజయవాడ: రాబోవు రోజుల్లో బలయమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు భవిష్యత్తు కార్యచరణతో పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలు చేసేందుకు సీపీఐ నగర సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని దాసరిభవన్‌లో బుధవారం సాయంత్రం 6 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. నగరంలోని పార్టీ కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సివిల్ సప్లయీస్ కార్మికులకు

పనిభద్రత కల్పించండి

యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు

విశాలాంధ్ర–గుంటూరు కలెక్టరేట్ : సివిల్ సప్లయీస్ కార్మికులకు పనిభద్రత కల్పించి సొంత గోడౌన్స్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు సివిల్ సప్లయీస్ యాజమాన్యాన్ని కోరారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ సమావేశానికి యూనియన్ నాయకులు సంపతి వెంకటకృష్ణ అధ్యక్షత వహించగా రావుల అంజిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని -మిగతా 2 లో ...

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై వీడని సందిగ్ధత

- హాజరుకాని సభ్యులు
- కోరం సరిపోక ఎన్నికలు ముగిసాయని ఆర్డీఓ ప్రకటన
- ఎన్నికల కమిషన్‌దే తుది నిర్ణయం

విశాలాంధ్ర–తిరువూరు : మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక సోమవారం వాయిదా పడటంతో తిరిగి మంగళవారం ఎన్నికలు నిర్వహించగా మంగళవారం కూడా మున్సిపల్ కౌన్సిలర్లు రాకపోవడంతో చైర్మన్ ఎన్నికకు సరిపడా సభ్యులు (కోరం) రాకపోవడంతో వాయిదాలు లేవని -మిగతా 2 లో ...

భారీ వర్షాలు

- లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం
- పలు ప్రాంతాల్లో స్తంభించిన జనజీవనం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర–విజయవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మంగళవారం తెల్లవారుజాము నుండి కురుస్తున్న వర్షాలతో ప్రజలు -మిగతా 2 లో ...

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర–మచిలీపట్నం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు, పేదలకు వ్యతిరేకంగా కొత్త, కొత్త చట్టాలు తీసుకొస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా పరిపాలన చేస్తున్నాయని ఏఐటియూసి జిల్లా నాయకులు లింగం ఫిలిప్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కోనేరు సెంటర్లో వివిధ ప్రజా సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కార్మిక వర్గాలు ఐకమత్యంగా 22సార్లు సమ్మె జరిపాయని, కార్మికుల ఐక్యతను చూసి భయపడుతున్న కేంద్రం ఇప్పటి వరకు తను తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయకుండా అవకాశం కోసం ఎదురు చూస్తుందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేటు పరం చేయడానికి వీల్లేదు అంటూ కార్మికులు నేటి నుంచి సమ్మెకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఉపాధ్యాయ సంఘాలు సమైక్యంగా ముందుకు వచ్చి విద్యారంగంలో సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టాయి అన్నారు. కార్మికుల నెలవారీ కనీస వేతనం రూ:26 వేలు ఇవ్వాలి, -మిగతా 2 లో ...

ఫలించిన చర్చలు

ఉద్యమ కార్యాచరణ వాయిదా

విశాలాంధ్ర–చిలకలూరిపేట: ఉపాధ్యాయ సమస్యలపై బుధవారం నిర్వహించాల్సిన ఆందోళనను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో ప్రభుత్వం కొన్ని అంశాలను ఆమోదించటంతో ఆందోళనను వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ పద్దతిలో బదిలీలు నిర్వహించటానికి ప్రభుత్వం అంగీకరించిందని, ఉన్నత పాఠశాలల్లో 49 దాటిన తరువాత 2 వసెక్షన్ ఏర్పాటు చేయటానికి, ఫౌండేషన్ పాఠశాలల్లో 20 రోల్ దాటిన తరువాత 2వ పోస్టు ఇవ్వడానికి -మిగతా 2 లో ...

రోడ్డు ప్రమాదాలు తగ్గాలి

కలెక్టర్ అరుణ్ బాబు

విశాలాంధ్ర–నరసరావుపేట: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో సగటున నెలకు 50 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. అత్యవసరంగా ప్రమాదాల సంఖ్య 25 కి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. 2023, 2024 సంవత్సరాలలో జిల్లాలో వరసగా 576, 612 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. 2025 లో ఏప్రిల్ నాటికి 263 ప్రమాదాలు జరిగాయన్నారు. 2024లో రోడ్డు ప్రమాదాలలో 380 మంది మరణించగా.. 2025లో నాలుగు -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

సివిల్ సప్లయిస్ కార్మికులకు పనిభద్రత కల్పించండి

ప్రసంగించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక భాగస్వామిగా పనిచేయుచున్న ముఠా కార్మికులకు సంబంధించి నెల బిల్లులు మళ్లీ నెల వచ్చేదాకా అందటం లేదని, నెల బిల్లులను త్వరితగతిన కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బకాయి ఉన్న యూనిఫామ్‌ను వెంటనే విడుదల చేయాలని, ఐడెంటి కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, యూనియన్ ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాల కోసం ఈ కమిటీలో నిర్ణయించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు నిర్వహించబోయే సమరశీల పోరాటాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరగబోతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం, సివిల్ సప్లయిస్ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన సౌకర్యాలను త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు దానం, అశోక్ రెడ్డి, నీలం రామారావు, ప్రసాదు, సురేష్, నవీన్, ఏసుబాబు, నరసింహారావు, రొయ్యల శీను, సైదులు, సాంబశివరావు, బ్రహ్మయ్య, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై వీడని సందిగ్ధత

ఇప్పటితో ఎన్నికలు ముగిశాయని జిల్లా రెవెన్యూ అధికారి యం.లక్ష్మీనరసింహం, ఆర్డీవో కే మాధురి ప్రకటించారు. తర్వాత ఏం చేయాలనేది ఎన్నికల కమిషన్‌కి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం బట్టి తదుపరి సమాచారాన్ని వెల్లడిస్తామని ఆర్డీఓ తెలిపారు. రెండవ రోజు మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు టీడీపి కూటమి సభ్యులు ముగ్గురు, కూటమి మద్దతు పలికిన ఐదుగురు, జనసేనకు మద్దతుగా ఒకరు మాత్రమే హాజరు కాగా వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో చైర్ పర్సన్ ఎన్నికలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కేంద్రం తీసుకొస్తున్న నల్ల చట్టాలను రాష్ట్రంలో అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని కూడా కార్మిక సంఘాల తరపున వ్యతిరేకిస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల వ్యతిరేకతను అర్థం చేసుకుని చట్టాలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకి సిద్ధమవుతున్నామని వారు హెచ్చరించారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేస్తూ కృష్ణా జిల్లా మచిలీపట్నం ఏఐటీయూసీ, సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఒంటిపులి లక్ష్మణరావు, యర్రంశెట్టి ఈశ్వరరావు, ఫణీంద్ర, జోసెఫ్, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, మండల కార్యదర్శి చిరువోలు జయరావు, ఆశ వర్కర్ల సంఘం జిల్లా కోశాధికారి కిరణ్మయి, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి, ఆశ వర్కర్ల గ్రామీణ ప్రాంత నాయకురాలు దాసరి కృపా జయ, ఆశ వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకురాలు కాసిమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు చొక్కాకుల బుల్లెమ్మ, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం నాయకులు మహమ్మద్ యూనస్, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఉద్యోగుల సంఘం నాయకులు దొవారి విజయరాజు, కోనేరు సెంటర్ పెద్ద ముఠా హమాలీలు పాల్గొన్నారు.

ఫలించిన చర్చలు

ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రాథమిక పాఠశాలలు విడిగా నిర్వహిస్తారని, వర్క్ లోడ్ ఎక్కువయ్యే సందర్భంలో వర్క్ లోడ్ ఉన్న సబ్జెక్టులకు అవసరం మేరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్/సర్వీస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారని వెల్లడించారు. వీటితో పాటు అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గాలి

నెలల కాలంలో 152 మరణాలు సంభవించాయన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాస రావు జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం, మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ సమావేశం నిర్వహించారు. టూ వీలర్లు, భారీ వాహనాలు అత్యధిక ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. జిల్లాలో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్లపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులతో నడిచే వాహనాలు, మైనర్ డ్రైవింగ్, అతివేగం, మద్యం ప్రభావంలో వాహనాలు నడపడంపై ఉక్కుపాదం మోపాలన్నారు. రవాణా శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో జిల్లాలోని అన్ని రోడ్లపై తనిఖీలు నిర్వహించాలన్నారు. కాలేజీ విద్యార్థులు, రైతు కూలీలు పరిమితికి మించి ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించడం ప్రాణాలకు ఎంత ప్రమాదమో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, రోడ్లు అండ్ భవనాల శాఖ ఎస్.ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, డిఎంహెచ్వో రవి, డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం కావడంతో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం కావడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం నెలకొంది. కొన్ని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల జారి చేస్తున్నాయి. వర్షాలు కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లాలో రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, మునిసిపల్, వ్యవసాయ తదితర శాఖల అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అందుబాటులో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 9154 970 454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ) ఏర్పాటు చేశామని.. ప్రజలు తమకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఈ నంబరులో సంప్రదించి, సమాచారమివ్వాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా, సరఫరాలో ఆటంకం లేకుండా పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, నిరంతరం పరిస్థితిని సమీక్షించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా.. రోడ్లపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపేందుకు అవసరమైన సిబ్బంది, ఇంజిన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా చెట్లు కూలితే వెంటనే తొలగించేలా ఆదేశాలిచ్చామన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని.. చెట్ల కింద నిలుచోవడం వంటివి చేయొద్దని, వాహనాలను భద్రమైన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని, వర్షాలు పడే సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సహాయక చర్యలు అవసరమైనా చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంటల రక్షణకు సంబంధించి తగు సూచనలు చేయాలన్నారు. ఒకవేళ విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే వెంటనే పునరుద్ధరించి, సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ భద్రత

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): యోగా మహోత్సవం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు అన్నారు. మంగళవారం పున్నమిఘాట్‌లో అధికారులతో కలిసి భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21వతేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21వతేదీ నుంచి జూన్ 21వతేదీ వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున పున్నమి ఘాట్‌లో జరిగే ఈ యోగా ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారన్నారు. భద్రత పరంగా ఎటువంటి లోపాలు లేకుండా లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాలు, పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌వీడీ.ప్రసాద్, సబ్ కలెక్టర్ చైతన్య, ఏడీసీపీలు జీ.రామకృష్ణ, ఏవీఎల్ ప్రసన్న కుమార్, ఏసీపీ దుర్గారావు, సీఐ ఉమామహేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్వాహకులకు శిక్షణ

విశాలాంధ్ర-విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న వృద్ధాశ్రమాలు, హోమ్ కేర్ నిర్వాహకులు, సూపర్ వైజర్లు, మేనేజర్లు, సంరక్షకుల శిక్షణా తరగతులు హెరిటేజ్ ఫౌండేషన్ వారి సహకారంతో విజయవాడ నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనంలో 21 వ తేదీ ఉదయం నుంచి జరగనున్నట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రారంభ సభలో రాష్ట్ర వృద్ధుల సంక్షేమం శాఖ సంచాలకులు బి రవి ప్రకాష్ ముఖ్య వక్త గా పాల్గొంటారని జిల్లాలోని వృద్ధాశ్రమాల నిర్వాహకులు పాల్గొనాలని ఆయన కోరారు.

విలువలు కలిగిన నాయకుడు టంగుటూరు ప్రకాశం పంతులు

విశాలాంధ్ర-అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం టంగుటూరు ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొల్లూరి మాట్లాడుతూ అసమాన దేశభక్తి కలిగిన ప్రకాశం పంతులు గారు దేశ స్వాతంత్ర్యం కోసం విశేష పోరాటం చేశారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, నిరుపేద కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ప్రముఖ వ్యక్తిగా వెలుగొంది, ఆంధ్ర కేసరిగా కీర్తి ప్రతిష్టలు పొందిన ఆ మహనీయుడు మన అందరికీ స్ఫూర్తి ప్రదాత కావాలని.. మద్రాస్ రాష్ట్రంలో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని ఆనాటి బ్రిటిష్ వారి తుపాకీకి గుండెను చూపించిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేమని.. టంగుటూరి ప్రకాశం పంతులు గారి జీవితమంతా ఆదర్శవంతం అని కొల్లూరి అన్నారు. ఈ కార్యక్రమంలో మాచవరపు ఆదినారాయణ, బండే రాఘవ, మాదివాడ రత్నారావు, కొండవీటి గోవింద్, గుంటూరు వినయ్, మెగా వత్తు గోపి, బచ్చు రాఘవయ్య, పైడి పాముల బాబురావు,తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి : జాస్తి వీరాంజనేయులు

విశాలాంధ్ర-విజయవాడ: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ అధికారులకు, పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శికి ఆయన వినతిపత్రాలు సమర్పించారు ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ సినీ నటుడిగా ప్రపంచంలోనే గొప్ప గుర్తింపు పొంది విశ్వవిఖ్యాత నటసార్వభౌముగా ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారని అన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు సేవలందించి రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటిచెప్పిన ధీరుడు అన్నారు. 1968 వ సంవత్సరంలో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ అవార్డుజాతీయ చలనచిత్ర పురస్కారాలు, రాష్ట్రపతి అవార్డులు వరించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు.

ఎన్నికల కమిషన్‌కు వైసీపీ ఫిర్యాదు

-తిరువూరు కౌన్సిలర్లకు రక్షణ కల్పించడంలో పోలీసుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ: తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికలకు హాజరయ్యేందుకు వెళ్తున్న వైసీపీ కౌన్సిలర్లకు రక్షణ కల్పించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ వైయస్ఆర్‌సీపీ ప్రతినిధి బృందం మండిపడింది. ఈ మేరకు వైయస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, పండుల రవీంద్రబాబు, వరుదు కళ్యాణి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఇతర ముఖ్య నాయకులు విజయవాడలో రెండవసారి ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీని కలిసి జరిగిన దౌర్జన్యంకు సంబంధించి ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కూడా పోలీసులు బేఖాతరు చేయని వైనంపై ఆధారాలతో సహా కమిషనర్‌కు వివరించారు. కౌన్సిలర్లకు భద్రత కల్పించకపోగా, దాడికి పాల్పడిన కూటమి నేతలకు అండగా నిలుస్తూ, వైసీపీ నేతలనే పోలీసులు అరెస్ట్‌ను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళారు.

మెజార్టీ పార్టీకే చైర్మన్ పీఠం : ఎంపి కేశినేని చిన్ని

విశాలాంధ్ర-విజయవాడ: తిరువూరులో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిష్పక్షపాతం జరగాలి. అధికారంలో వున్న తమపై ఇంకా వైసీపీ నాయకుల దాడులు, దౌర్జన్యాలు తగ్గలేదంటూ విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్లపై వర్షపు నీరు లేకుండా చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : వర్షం పడే సమయంలో రోడ్లపైన వర్షం నీరు నిలువ ఉండకుండా సిబ్బంది అంతా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కమిషనర్ నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఎంజీ రోడ్డు, బెంజ్‌సర్కిల్, నిర్మల స్కూల్‌రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్, లయోల కాలేజ్ రోడ్డు, లతా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రోడ్, కండ్రిక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వల్ల రోడ్లపైన నీటి నిలువలు ఉన్న ప్రాంతాల్లో తక్షణమే రోడ్లపైన నీటి నిలువలు లేకుండా అధికారుల చర్యలు తీసుకోవాలని, ఏమినిటీ సెక్రటరీలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటేషన్ సిబ్బంది వర్షపు నీరు ఉన్న రోడ్లలో వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైన వాహనాలను ఉపయోగించి నీటిని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కండ్రిక వద్ద నుండి 33 తూములు వరకు జరిగిన డీసిల్టింగ్ పనులను, డ్రెయినేజ్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించి ఔట్‌ఫాల్ డ్రెయిన్‌లో ప్రవాహానికి ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సామ్రాజ్యం, శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ ఆస్తులకు మరమ్మతులుండరాదు

నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తులకు ఎలాంటి మరమ్మతులుండరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో కమిషనర్ మంగళవారం ఎస్టేట్ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టేట్ విభాగంలోని నగరపాలక సంస్థ ఆస్తులైన కర్మల భవనాలు, స్వర్గపురి, కమ్యూనిటీ హాల్లు, కళ్యాణ మండపాలు ఎలాంటి మరమ్మతులు లేకుండా చూడాలని, దానికనుగుణంగా ఎస్టేట్, ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో ప్రస్తుతం ఉన్న ఎస్టేట్ ఆస్తుల్లో మరమ్మతులుంటే ఒక నివేదికను తయారుచేసి అందజేయాలన్నారు. అనంతరం ఇంజనీరింగ్ సిబ్బంది ఆయా మరమ్మతులను పూర్తి చేసి, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఎస్టేట్ విభాగంలో ఉన్న ఆస్తులు ఉండాలన్నారు. ఫైర్ సిబ్బంది ఎస్టేట్ విభాగంలోని నగరపాలక సంస్థ ఆస్తులన్నీ అగ్ని ప్రమాదాలకు గురికాకుండా ఫైర్ సేఫ్టీ మేజర్స్ ఉన్నాయా లేదో పరిశీలించి ఒక నివేదికను సమర్పించడమే కాకుండా నగరపాలక సంస్థ ఆస్తులన్నీ పూర్తిస్థాయిలో అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలను అమర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఇన్చార్జ్ ఎస్టేట్ ఆఫీసర్, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, జోనల్ కమిషనర్ ప్రభుదాస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యనారాయణ, ఎస్టేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగొద్దని తల్లి మందలించడంతో !

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): మద్యం తాగొద్దని తల్లి మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మంగళవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విజయవాడ పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన గద్దం రాజా చక్రవర్తి అదే ప్రాంతానికి చెందిన శిరీషతో 10 రోజుల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తలు నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నారు. భార్య తరపున బంధువులు ఇంట్లోనే ఉన్నారు. వారు డాబాపైకి వెళ్లి పడుకునే సమయంలో చక్రవర్తి ఇంట్లో మద్యం సేవిస్తున్నాడు. తల్లి చూసి కొడుకును మందలించింది. ఇంట్లో భార్య తరుపున బంధువులు ఉన్నారని, మద్యం సేవిస్తే ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందని మందలించి, తాను కూడా డాబా పైకి వెళ్లి నిద్రపోయింది. కొద్దిసేపటికి కింద వచ్చి చూసేసరికి చక్రవర్తి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

విశాలాంధ్ర-వత్సవాయి : యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని చిట్యాల శివార్లలోని సిమెం టు కరెంటు స్తంభాల తయారీ పరిశ్రమలో చోటుచేసు కుంది. పొరుగు రాష్ట్రం నుండి వలసకు వచ్చిన నీరవ్ (20) స్తంభాల తయారీ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. చిట్యాల గ్రామ సమీపంలో సిమెంట్ కరెంట్ స్తంభాల తయారీ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. మంగళవారం నీరవ్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో దీనిపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. పొట్టకూటి కోసం వచ్చిన యువకుడు వివిధ జీవిగా మారడంతో దీనికి గల కారణాలు ఏమిటో పూర్తిగా స్పష్టత రావడం లేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

విశాలాంధ్ర-విజయవాడ, (గాంధీనగర్) : విజయవాడ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జీఆర్పి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రత్నరాజు ఆధ్వర్యంలో జీఆర్పీ సీఐ జె.వి. రమణ ఆర్పీఎఫ్ అధికారుల సమన్వయంతో తనిఖీలు చేశారు. దేశంలో ఉగ్రవాదుల కదలికలు నేపథ్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఈ తనిఖీలు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్లో అనుమానితులు, సంఘవిద్రోహ శక్తులను గుర్తించడానికి ప్రత్యేకంగా రైల్వే పోలీసులు, జాగిలాలు, డీఎఫ్ ఎండీ, హెచ్‌హెచ్ఎండీలతో స్టేషన్లో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే సీఐ వెంకటరమణ మాట్లాడుతూ ఆర్పీఎఫ్ జీఆర్పీ పోలీసులు అసాంఘిక శక్తులు రైల్వే స్టేషన్లోకి చొరబడకుండా పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అనుమానిత వ్యక్తులు గానీ, బ్యాగులు గానీ ఉంటే రైల్వే పోలీసులకు లేదా 139కు ఫోన్‌చేసి సమాచారం అందించా ల్సిందిగా కోరారు.

యువకుడిపై రౌడీషీటర్ దాడి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పిలిస్తే ఆగలేదని బీరు సీసాతో రౌడీ షీటర్ దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కేదారాజేశ్వరపేటకు చెందిన పేటేటి మహేంద్ర(21) మహంతిపురంలోని తాన బాబాయి ఇంటికి వెళ్లాడు. ఆ ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ ఇర్ఫాన్ ఆఫ్రోజ్ అలీ ఆ యువకుడిని పిలిచాడు. దీంతో అతను రాకపోవడంతో మద్యం మత్తులో రౌడీషీటర్ బీరు సీసాతో దాడికి పాల్పడ్డాడు. మహేంద్రకు తల్లపై రక్తపు గాయాలైంది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : కార్మికులను కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని వామపక్ష, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం వామపక్ష, కార్మిక సంఘాల నేతలు, కార్మికులు చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబరర్లు అమలులోకి వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందన్నారు. కార్మికులు కష్టకాలంలో వినియోగించుకునే సమ్మెహక్కును కాజేయటం అత్యంత ప్రమాదకరమన్నారు. లేబరకోర్ల రద్దుతోపాటు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలనీ, ప్రభుత్వ సంస్థల ప్రవేటీకరణ ఆపాలనీ, స్కీమ్ వర్కర్లందరినీ కార్మికులుగాగుర్తించాలనీ, కాంట్రాక్ట్.. ఔట్ సోర్సింగ్ టెండర్ విధానాన్ని రద్దుచేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లానేత జన్ను జగన్, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, వృకాస అధ్యక్షుడు మేడేపల్లి వెంకటేశ్వరరావు, వృత్తిసంఘం జిల్లా నేత వాకా రామచంద్రరావు, తలారి నాగేశ్వరరావు, చల్లపల్లి గంగాభవానీ, మాచారం ఆదినారాయణ, వెనిగళ్ల వసంతరావు, గోళ్ల సాంబశివరావు, చోడాబత్తిన ఆదినారాయణ, అన్నారీలతోపాటు అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, ఆటోవర్కర్స్, పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో...

బిజెపి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కంచర్లపల్లి వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం ఉయ్యూరు సెంటర్ టాకీస్ స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ఆందోళన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభం చేయాలని కోరారు స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆకవరపు తిరుపతయ్య ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బి కీర్తి నాయకులు గోపాల్, బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇబ్రహీం మురళి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సాయి శీను, కృష్ణకుమారి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ



విశాలాంధ్ర-గంపలగూడెం : విద్యార్థులచే ఐస్ క్రీమ్ పుల్లలతో వివిధ రకాల అలంకరణ బొమ్మలు ఎలా తయారు చేయాలో నేర్పించట మయినది. మండలంలోని పెనుగొలను శాఖ గ్రంథాలయంలో మంగళవారం వీరాసుల శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పట్నం ఖాతాలు చెప్పించడం జరిగింది. హైస్కూల్ విద్యార్థుల చేత కంప్యూటర్ ప్రాక్టీస్ చేయించడమయినది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల లకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

ఆకస్మిక తనిఖీలను ముమ్మరం : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జి లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్టీ-సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ ఎ.సత్యానంద్ హాజరైన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఫిర్యాదులు వస్తే వాటిని త్వరితగతిన విచారించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతమున్న స్కానింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త రిజిస్ట్రేషన్లకు సంబంధించిన తొమ్మిది దరఖాస్తులను, మూడు రెన్యువల్ దరఖాస్తులను, నాలుగు క్యాన్సిలేషన్ దరఖాస్తులను కమిటీ పరిశీలించి, చర్చించి, ఆమోదం తెలిపింది. అదేవిధంగా ఏఆర్‌టీ లెవెల్-1 కేటగిరీకి సంబంధించిన రెండు దరఖాస్తులు, ఏఆర్‌టీ లెవెల్-2 కేటగిరీకి సంబంధించిన రెండు దరఖాస్తుతోపాటు సరోగసీ క్లినిక్‌కు సంబంధించి ఒక దరఖాస్తుకు కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మి, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డా. పద్మజ, ఎన్‌హెచ్ఎం డీపీఎంవో డా. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

కొల్లూరి చినఆదియ్య, తండ్రి వెంకయ్య అను నేను ఘంటశాల మండల పరిధిలోని లంకపల్లి గ్రామ నివాసిని. నా ఇంటి దస్తావేజులు సర్వే నెంబర్ 131-1/1971, గల డాక్యుమెంట్లను ఘంటశాల తీసుకొస్తుండగా మార్గమధ్యంలో పడిపోయింది. నా డాక్యుమెంట్స్ నాకు ఎంతో అవసరం. నా డాక్యుమెంట్స్ దొరికిన వారు నా ఫోన్ నెంబర్ 9949907139 నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

సభ్యులు లేక.. సమీక్షతో సరి

హాజరే అరకొరగా...ఆరంభానికి ముందే సెలవు

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేటలో మంగళవారం నిర్వహించిన మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం ఒక కొత్త సాంప్రదాయానికి తెరలేపింది. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన మండలంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించేందుకు స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో సిహెచ్.చిన్నరత్నాలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటలకు సమావేశం ఆరంభం కావలసి ఉండగా, 11 గంటలు దాటే వరకు సభ్యుల జాడ కనిపించకున్నా అధికారులు సమావేశం ప్రారంభించారు. సభ్యుల జాడ విషయమై అప్పటికే ఏడుగురు సభ్యులు వచ్చి, హాజరైనట్లు సంతకాలు చేసి, ఇతర పనుల నిమిత్తం వెళ్లిపోయినట్లు ఆయన ప్రకటించారు. ఎంపీపీ మెర్సీ వనజాక్షితో పాటు చంద్రుపట్ల, చంద్రుపట్ల తండా సర్పంచులు, విస్సన్నపేట-1, కొర్లమండ, చంద్రుపట్ల ఎంపీటీసీ సభ్యులు హాజరైనా, ప్రజా సమస్యలపై కనీస ప్రస్తావన చేయలేదు. ఇక అధికారులే తమశాఖలు చేస్తున్న పని, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, వారికి వారే సమీక్ష జరుపుకుని, సమావేశాన్ని ముగించారు. తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణి, ఎమ్మీవో సుధాకర్, ఇన్‌చార్జి గ్రామీణాభివృద్ధి అధికారి గోపాలకృష్ణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద సమస్యను పరిష్కరిద్దాం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వర్షం కురిసిన ప్రతిసారీ విస్సన్నపేట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం నీట మునగటం, రోజుల తరబడి నీరు నిలిచి, మురికి కూపంగా మారటం జరుగుతోంది. తాజాగా సైతం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గమంతా నీట మునిగి ఉండగా, అధికారులు సెప్టిక్‌ట్యాంకు క్లీనర్ల సాయంతో నీటిని బయటకు తరలించారు. విస్సన్నపేటలో రెవిన్యూ, మండలపరిషత్తు, విద్యాశాఖ, వెలుగు, నరేగా, గృహ నిర్మాణం, 108, ఇంజనీరింగ్ విభాగం కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. మురుగుకాలువల నిర్వహణ దెబ్బతినటంతో వర్షం కురిసిన ప్రతి సందర్భంలోనూ ఈ ప్రాంగణం వర్షపు నీటితో మునగటం, నీరు బయటకు వెళ్లే మార్గం లేక మురుగు కూపంగా మారి, రాకపోకలు సాగించేందుకు అధికారులు, ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై తాజాగా అధికారులు దృష్టి సారించారు. తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చిన్నరత్నాలు, ఇన్‌చార్జి గ్రామీణాభివృద్ధి అధికారి గోపాలకృష్ణ, ఆర్‌ఐ సుజాత, ఆర్‌డబ్ల్యుయస్. ఏఈ లక్ష్మి, గ్రామ ప్రముఖులు నెక్కళపు శ్రీనివాసరావు(డాబా శ్రీను)తో కలసి పరిశీలన చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో నీరు నిల్వ చేరకుండా కొన్ని చర్యలు చేపట్టడంతోపాటు, కార్యాలయం నుంచి శ్రీరామ్ థియేటర్ వరకు గల మురుగుకాలువ పూడిక తీత కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు.

కూచిపూడిలో భారీ వర్షం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో మంగళవారం వేకువజామున ఉరుములు మెరుపులు పిడుగులతో గంటకు పైగా కురిసిన వర్షం జనజీవనాన్ని స్తంభం చేసింది. ఈ నెలలో అత్యధికంగా 50. 8 మిల్లీమీటర్లు (సుమారు ఆరు సెంటీమీటర్లు) కురిసిన వర్షంతో పలు ప్రాంతాలలో ప్రధాన రహదారులు చెరువులుగామారాయి. కూచిపూడి సెంటర్ నుంచి పెదపూడి వెళ్లే ఆర్ అండ్ బి రహదారి చెరువు ప్రాంతంలో వర్షపు నీరుపోయేమార్గం లేక నిలబడటంతోవాహనదారులు పడిన పాట్లు వర్ణనాతీతం. అలాగే కూచిపూడి నుంచి బార్లపూడివెళ్లేరహదారిలోశ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం, శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల రోడ్డుపై నీరు ప్రవహించింది. కొంతసేపటికి మీరు తగ్గి రాకపోకలకు ఇబ్బందులుతొలగాయి. మండలంలోని పలు గ్రామాలలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

యాదవుల అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ, (గాంధీనగర్): దేశవ్యాప్తంగా యాదవులు సమాజంలో వెనుకబాటుతనంతో ఇబ్బందులు పడుతున్నారని వారి సంక్షేమానికి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు వంటివి ఇచ్చి ప్రోత్సహించాలని అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు మహేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. యాదవులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అఖిలభారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు మహేష్ యాదవ్ ఆంధ్ర ప్రదేశ్ పర్యటన సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు లాగా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానిగా ఇందిరాగాంధీ హయాంలో రద్దు చేసిన అహిరా రెజిమెంట్ను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోగుల రమణ, రాష్ట్ర కార్యదర్శి దానబోయిన అంజయ్య, కోస్తా జిల్లాల అధ్యక్షులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలంలో మంగళవారం నాడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలి నిర్వహించారు అనంతరం స్థానిక తహసిల్దార్ రాజకుమార్ కి మెమోరాండం అందజేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లాఅధ్యక్షులు మద్దిరెడ్డి. వెంకటరెడ్డి , సిఐటీయు మండలకార్యదర్శి జానిపాటి .వెంకటేశ్వర రావు, మల్లవరపు .కుటుంబరావు, గువ్వల. శీతారామిరెడ్డి మరియు ఆశావర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-కృత్తివెన్ను : పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన నీలిపూడిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో 5 లక్షల రూపాయలు తో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కాగిత మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. 1100 రూపాయల విలువగల పశువుల దాణాని సగం ధరకే రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాశం కృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు ఒడుగు తులసిరావు, ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షులు తిరుమల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యోగ ప్రాముఖ్యతను తెలిసేలా 'యోగాంధ్ర' : జేసీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం సముద్రం ఒడ్డున రాష్ట్రస్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించడంజరుగుతుందని, భారత ప్రధాని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని, మే 21 నుండి జూన్ 21 వరకు యోగ ప్రాముఖ్య తను తెలియజేసేలా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు కృష్ణా జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమానికన బుధవారం నగరంలో ర్యాలీ అనంతరం బ్యాట్‌మెంటెన్ కోర్టు ఇండోర్ స్టేడియంలో ప్రారంభిస్తామని, ముగింపు కార్యక్రమం మంగినపూడి బీచ్ లేదా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యోగా కార్యక్రమాలకు ఉత్తర్వులు జారీ చేసిందని, జిల్లా, మండల, గ్రామ స్థాయి యోగాంధ్ర కార్యక్రమాల్లో యోగాభ్యాసాలు వేయించేందుకు నైపుణ్యం కలిగిన శిక్షకులను 26 మండలాలకు గుర్తించాలన్నారు. డీఆర్ఓ కే. చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఉదయం 6.30 గంటలకు నగరంలోని సాయిబాబాగుడి నుండి ర్యాలీగా బయలుదేరి జిల్లా కోర్టు సమీపంలోని స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీకి సంబంధించిన జెండాలు, బ్యానర్లు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే. రామారావు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో...

దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా కార్మిక సంఘాలు నిరసన తెలిపారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మెకు వామపక్ష కార్మిక సంఘాలు పిలుపునివ్వగా అనుకోని పరిస్థితుల్లో దేశంలో యుద్ధ వాతావరణం ఉండడంతో ఆ సమ్మెను జులై 9వ తేదీకి వాయిదా వేశారు. అవనిగడ్డ బస్టాండ్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మార్రపు పోలినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం 26, వేలు అమలు చేయాలని డిమాండ్లతో నిరసన ప్రదర్శన చేశారు అంగన్వాడి ప్రాజెక్టు ఏరియా నాయకురాలు ఏ నాగమణి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వర రావు, మండల అధ్యక్షులు యాసం శ్రీనివాసరావు, బందారు భూషయ్య కార్పెంటర్ అసోసియేషన్ నాయకులు నాంచారయ్య ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వోల్గా ఆర్చరీ అకాడమీకి రూ.1.16 లక్షలు

విశాలాంధ్ర-విజయవాడ: విలువిద్యలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న వోల్గా ఆర్చరీ అకాడమీకి పీ 4 విధానం స్ఫూర్తితో క్రీడా పరికరాలను అందించేందుకు అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులు ముందుకువచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో వోల్గా ఆర్చరీ అకాడమీకి రూ.1.16 లక్షల విలువైన ఆర్చరీ ఉపకరణాలను అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్ లక్ష్మీశ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదగ్గర ప్రతిభ ఉన్న విలువిద్య క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారు.. వారికి మరింత నాణ్యమైన శిక్షణ అందిస్తే ఒలింపిక్‌తో పాటు వివిధ అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించే సత్తా ఉందన్నారు. ఆర్చరీ అకాడమీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా శిక్షణ అందిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరావతి బోటింగ్ క్లబ్ (ఎబీసీ) సీఈవో తరుణ్ కాకాని, వోల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ నేషనల్ కమిటీ సభ్యులు బీవీ రమణ, జిల్లా ట్రెజరర్ జి.ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర-మంగళగిరి : కోర్టు వాయిదాలకు రాకుండా తప్పించుకు తిరుగుతున్న విజయవాడ కొత్తపేటకు చెందిన సింహా దుర్గారావు అనే నిందితుడిని గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మంగళవారం తెలిపారు. 21 ఏళ్ల వయసు గల సదరు వ్యక్తి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా ఏడాది కాలంగా తప్పించుకు తిరుగుతున్నాడని ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. న్యాయస్థానం సదరు వ్యక్తికి ఎన్‌బీడబ్ల్యు ఇచ్చిందని తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఎవరైనా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరిగితే ఇదే తరహాలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీనివాసపద్మావతి అమ్మవారికి ఊంజల్ సేవ

విశాలాంధ్ర-తెనాలి : జగ్గడిగుంట పాలెం పంచా యతీ పరిధి లోని ప్రగడ కోటయ్య నగర్ రామాలయంలో వేంచేసి ఉన్న పద్మావతి అమ్మవారి సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం పండిట్ కొండవి దత్తుశర్మ ఆధ్వర్యంలో ఊంజల్‌సేవ కార్యక్రమం కటకం కోదండరాంబాబు, అన్నపూర్ణ దంపతులు నిర్వహిం చారు. వేంకటేశ్వర స్వామి భక్తి గీతాలతో అత్యంత వైభవోపేతంగా భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రీనివాసపద్మావతి అమ్మవారి ఉత్స వాలు నిర్వహించుకుంటున్నామని నిర్వాహకులు తెలి పారు. కార్యక్రమంలో అందెబాలచంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, ఆకురాతిరాజు, మౌనిక, వంగర సత్యనారా యణ, కోటేశ్వరమ్మ, జగ్గారపు మల్లేశ్వరరావు, చంద్రా వతి, నందం చలమేశ్వరరావు, రేణుక, సువాసినిలచే భక్తి ప్రపత్తులతో అనేకమంది పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

విశాలాంధ్ర-పెదనంది పాడు: స్థానిక పీఏఎస్ కళాశాల నుంచి చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో జరుగు నాలుగవ కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపునకు హాజరయ్యే ఎన్.సి.సి విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం వీర రాఘవయ్య మంగళవారం యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ పాతూరి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె.ప్రతాప్ కుమార్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పొట్టకొట్టే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : కార్మి కులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటీఎంసీ పరిధి లోని ప్రాతూరు రోడ్డు జాతీయ రహ దారి వద్ద కార్మిక, రైతు సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ నాయకులు పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శివశంకరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రైతాంగ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ విధానాలను రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నప్పటికీ మోదీ ప్రభుత్వం నిరంకుశంగా ప్రజా వ్యతి రేక చట్టాలను తీసుకురావడం అన్యా యమని అన్నారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంక టరెడ్డి మాట్లా డుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదు గుల శ్రీనివాసరెడ్డి, రైతు నాయకులు అమ్మిశెట్టి రంగారావు, టి.బక్కిరెడ్డి, డోకిపర్తి రాజేంద్ర బాబు, రత్తయ్య, గోపాలం శంకర్రావు, సుబ్బారావు, శివయ్య, కృపారావు, సంకురు జూలీ రాజ్, అమ్మిశెట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. మంగళగిరి పట్టణంలోని టిప్పర్లబజార్‌కు చెందిన షేక్ ముస్కాన్‌కు రూ.2 లక్షలు, సూర్యనారాయణనగర్‌కు చెందిన సాదరబోయిన శరణ్యకు రూ.2 లక్షలు, ద్వారకానగర్‌కు చెందిన దొడ్డి దుర్గా మహేష్‌కు రూ.1.20 లక్షలు, 19వ వార్డుకు చెందిన మాచర్ల యుగంధర్‌కు రూ.1.50 లక్షలు విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ) చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ భోగి కోటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ ఖాదర్ వలి(ఫిరోజ్), 19వ వార్డు అధ్యక్షులు చెల్లూరి వీర వెంకట సత్యనారాయణ, 4వ వార్డు అధ్యక్షులు శివరామకృష్ణ, నాయకులు షేక్ సమీర, గోలి నాగ శ్రీనివాసరావు, గంటా దుర్గాప్రసాద్, వంగర రమేష్, గుంటి ప్రతాప్, అందె వీరస్వామి, తోకల బాలాజీ, దామర్ల బిక్షారావ్, తాడిచర్ల వీరన్న, జనం వెంకట సుబ్బారావు, షేక్ ఖాదర్ వలి, షేక్ ఖాసిం, బేతాళ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకున్న రాజధాని యువత

విశాలాంధ్ర-తుళ్లూరు : ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో మంగళవారం తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, రిటైల్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్, ఐటీ సేవలు, ఫైనాన్స్ రంగాలకు చెందిన 11 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఇందులో ఎస్‌సీసీ, సీ11-ఎంసీసీ, కాన్సెప్ట్ సర్వీసెస్(ఐటీసీ) ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్, బీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్, ఎస్‌బీఐ కార్డ్స్, వెకెన్ ఇండియా, హ్యాపీ మొబైల్స్, వరుణ్ మోటార్స్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పటల్స్, స్కిల్‌క్రాఫ్ట్ లిమిటెడ్ వంటి సంస్థలు ఉన్నాయి. మొత్తం 589 మంది అభ్యర్థులు ఈ మేళాకు హాజరయ్యారు. పలువురు అభ్యర్థులు బహుళ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరవ్వడంతో మొత్తం 900 మందికి పైగా ఇంటర్వ్యూలు నిర్వహించబడ్డాయి. ఫలితంగా 100 మంది అభ్యర్థులు తక్షణ ఉద్యోగ ఆఫర్‌లను పొందగా, 170 మందిని సంస్థలు తదుపరి రిక్రూట్‌మెంట్ రౌండ్లకు ఎంపిక చేసుకున్నాయి. ఈ మేళా విజయవంతంగా సాగేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య శిక్షణ అధికారి సాయి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి సమన్వయ బాధ్యతలు నిర్వహించారు. ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.నరసింహారావు, సీఆర్‌డీఏ డీడీఓ బి.శ్రీనివాసరావు, సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక సిబ్బందిని నియమించి, రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేశారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ జోరు వానలో నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లి : కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ తాడేపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని తాడేపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావటం కార్మికుల పొట్ట కొట్టడమేనని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.బాబురావు, బి.సూర్యప్రకాష్, కె.స్టీవెన్, కె.లక్ష్మి, బి.బాబురావు, బి.రేణుక, బి.కమల, జి.కొండయ్య, కె.వెంకమ్మ, పి.సంతోషం, ఇసుకపల్లి ఇసాక్, డి.నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కె.వెంకటయ్య, వైఎస్సార్‌టీయూ నాయకులు ఆర్.శ్రీనివాసరాజు, అంగన్‌వాడీ, ఆశ, సిమెంట్ కంపెనీ, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొని నిరసన తెలియజేశారు.

ఘనంగా తిరంగా యాత్ర ర్యాలీ

విశాలాంధ్ర-పెదకాకాని : పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని మన సైనికులకు మద్దతుగా మంగళవారం పెదకాకాని మండలం పరిషత్ కార్యాలయం నుంచి కాకాని శివాలయం రోడ్డు వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ కృష్ణకాంత్, మండల టీడీపీ అధ్యక్షులు వలి వేటి మురళీకృష్ణ, మండలంలోని తెలుగుదేశం-జనసేన-బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71ఎ, పొవై, పాస్పోలి, ముంబై-400087

స్వాధీనత ప్రకటన

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అధీకృత అధికారియైన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2022) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత, తనఖాదారు, సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు :- ఎం/ఎస్. శ్రీ గంగమ్మతల్లి డెయిరీ ఫాం (రుణగ్రహీత), శ్రీ నల్లగొర్ల శ్రీనివాసరావు తండ్రి వెన్నయ్య నల్లగొర్ల (సహ-రుణగ్రహీత, తనఖాదారు), శ్రీ నల్లగొర్ల వెన్నయ్య తండ్రి ఆంజనేయులు (సహ-రుణగ్రహీత), శ్రీమతి నల్లగొర్ల రమాదేవి భర్త వెన్నయ్య (సహ- రుణగ్రహీత) లకు నోటీసులో ప్రస్తావించిన మొత్తం బకాయి రుణఖాతా FEDVIJSTL0491866 నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృచ్ఛిక ఖర్చులు వగైరాలతో కలిసి తేదీ: 17.01.2025 నాటికి రూ.21,61,170/- (ఇరవై ఒక్క లక్షల అరవై ఒక్కవేల నూట డెబ్బై రూపాయలు మాత్రమే) లను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తేదీ : 27.01.2025 న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు నిబంధనల్లో తెలిపిన నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించిన ఆస్తిని మే 19, 2025 న లాంఛనప్రాయంగా స్వాధీనపరచుకొనడమైనది (ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని మరియు ఈ ఆస్తిపై ఏదేని లావాదేవీలు, రుణఖాతా FEDVIJSTL0491866 నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృచ్ఛిక ఖర్చులు వగైరాలతో కలిసి తేదీ: 17.01.2025 నాటికి రూ.21,61,170/- (ఇరవై ఒక్క లక్షల అరవై ఒక్కవేల నూట డెబ్బై రూపాయలు మాత్రమే) ల కొరకు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు మరియు సాధారణ ప్రజలు హెచ్చరించడమైనది.

హామీగా పెట్టిన ఆస్తులను తిరిగి పొందటానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

షెడ్యూల్-1తనఖా పెట్టిన ఆస్తి వివరాలు: గుంటూరు జిల్లా, గుంటూరు ఎస్ఆర్ఓ, ఇంతకుముందు రెడ్డిపాలెం గ్రామ పంచాయితీకి - ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, గుంటూరు గ్రామం డి.నం.371-మునిసిపల్ అసెస్‌మెంట్ నం.1021145071, డి. నం.1-59/ఏ, ఇందులో అన్ని అనుభవ హక్కులతో 219.55 చదరపు గజాల విస్తీర్ణపు ఆస్తి. సరిహద్దులు: తూర్పు: మునిసిపల్ రోడ్ 26.1 అడుగులు, పడమర: నామాల శంకర్ ఆస్తి 35.2 అడుగులు., ఉత్తరం: శ్రీమతి నల్లగొర్ల రమాదేవి ఆస్తి భాగం (33 అడుగులు) మరియు నల్లగొర్ల పెద్ద అంకమ్మ (32 అడుగులు) 65 అడుగులు దక్షిణం: నల్లగొర్ల రాజు ఆస్తి 32 అడుగులు, మళ్లీ తూర్పు: నల్లగొర్ల రాజు ఆస్తి 8.9 అడుగులు, మళ్లీ దక్షిణం: వీరక రాజశేఖర్ ఆస్తి 32.6 అడుగులు

ప్రదేశము : గుంటూరు
తేదీ : 19-05-2025

సం/- (అధీకృత అధికారి)
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

మహానాడు విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కడపలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన మినీ మహానాడు కార్యక్ర మంలో గుంటూరులో అసంపూర్ణంగా మిగిలి పోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, పశ్చిమ నియోజక వర్గంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీలోనూ, ప్రభుత్వం లోనూ సముచిత స్థానం కల్పించాలని తదితర అంశాల మీద చేసిన తీర్మానాలను పార్టీ నేతలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లా డుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ప్రజల పక్షాన నిలబడిన పార్టీ అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో పశ్చిమ నియో జకవర్గంలో రూ.1కోటి, 28లక్షల, 78వేలు ముఖ్య మంత్రి సహాయనిధి అందజేశామన్నారు. ఆంధ్రప్ర దేశ్‌లో 5 ఏళ్ల అంధకారం తర్వాత తెలుగు ప్రజలు జరుపుకుంటున్న పండుగ మహా నాడు అని తెలిపారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, టీడీపీ నాయకులు తాడిశెట్టి మురళి, దేగల ప్రభాకర్‌లు మాట్లాడుతూ మూడు రోజుల పాటు కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు మన్నవ మోహన కృష్ణ, మల్లె ఈశ్వర రావు, టీడీపీ నాయకులు మద్దిరాల మ్యానీ, తాళ్ళ వెంకటేష్, నిమ్మల శేషయ్య, మానుకొండ శివ ప్రసాద్, లాల్ వజీర్, కార్పొరేటర్లు, నియోజకవర్గ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

లింగ వివక్ష, అసమానతలపై అవగాహన

విశాలాంధ్ర-అమరావతి: సమాజంలో అన్ని రంగా లలో ఆడపిల్ల లను తీర్చిదిద్ద టంలో తల్లిదండ్రులు భాగస్వాములు కావలసిన అవ సరం ఎంతైనా ఉందని ఐసిడిఎస్ సూపర్వైజర్ జె.భార తిదేవీ ఏఎం ఎన్ ఉదయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని ధరణికోట లేమల్లె గ్రామాలలో కిషోరి వికాసం వేసవి శిక్షణ తరగతులలో భాగంగా జరిగిన కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ సందర్భంగా భారతి దేవి మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష, అసమానతలపై అనేక విష యాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్ల అన్ని విధాల అభివృద్ధిలో చదువులో ముందు నిలవా లని కోరారు. కార్యక్రమంలో బైరా పట్నం సింధు, ఏఎన్ ఎం వెంకటరామయ్య, వై వెంకటలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు ప్రసన్న భారతి, యమున, సరిత, జాంబి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ నిధులు మంజూరు

విశాలాంధ్ర-దుర్గి: జిల్లా మైనింగ్ నుంచి దుర్గి మండలా నికి రూ.1కోటి 99 లక్షల నిధులు మంజూరైనట్లు మండల పంచాయతీ రాజ్ ఏఈ హనుమంతరావు తెలిపారు. ఈ నిధుల ద్వారా పాఠశాలలకు వంట గదులు, కమ్యూనిటీ హాలు,స్వశానాలు,పాఠశాల గ్రౌండ్ అభివృద్ధి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా పనులు, అంచనా వివరాలు. అడిగోప్పల పాఠశాలకు రూ. 30 లక్షలు,ఓబులేశునిపల్లె కమ్యూనిటీ హాలు రూ. 29 లక్షలు,శ్యామరాజుపురం ఎస్సీ కమ్యూనిటీ హాలు రూ. 10 లక్షలు,ధర్మవరం ఓ.సీ.కమ్యూనిటీ హాలు రూ. 30 లక్షలు,దుర్గి ముస్లిమ్ కమ్యూనిటీ హాలుకు రూ. 20 లక్షలు, ముటుకూరు-1,2 స్వశానాల అభివృద్ధికి రూ. 50 లక్షలు,ముటుకూరు ఎస్టీ కమ్యూనిటీ హాలుకు రూ. 10 లక్షలు,కస్తూర్బా బాలికల పాఠశాల గ్రౌండ్ అభివృద్ధికి రూ. 10 లక్షలు చొప్పున అంచనా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ పనులకు ఈనెల 15న టెండర్ల దాఖల ప్రక్రియ పూర్తి అయిందని, తదుపరి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71ఎ, పొవై, పాస్పోలి, ముంబై-400087

స్వాధీనత ప్రకటన

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అధీకృత అధికారియైన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2022) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత, తనఖాదారు, సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు :- **చిమటా ప్రశాంత్ బాబు (రుణగ్రహీత, తనఖాదారు), చిమటా రమాదేవి (సహ-రుణగ్రహీత)** లకు నోటీసులో ప్రస్తావించిన మొత్తం బకాయి రుణఖాతా **FEDVJJ0HL0527553** నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి తేదీ: **17.01.2025 నాటికి రూ. 23,56,713 /- (ఇరవై మూడు లక్షల యాభైఆరు వేల ఏడువందల పదమూడు రూపాయలు మాత్రమే)** లను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తేదీ : **27.01.2025** న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు నిబంధనల్లో తెలిపిన నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించిన ఆస్తిని **మే 19, 2025** న లాంఛనప్రాయంగా స్వాధీనపర్చుకొనడమైందని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని మరియు ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు, రుణఖాతా **FEDVJJ0HL0527553** నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి తేదీ: **17.01.2025 నాటికి రూ. 23,56,713 /- (ఇరవై మూడు లక్షల యాభైఆరు వేల ఏడువందల పదమూడు రూపాయలు మాత్రమే)** ల కొరకు **ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్** చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు మరియు సాధారణప్రజలను హెచ్చరించడమైనది. హామీగా పెట్టిన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

షెడ్యూల్-1-తనఖా పెట్టిన ఆస్తి వివరాలు:

పల్నాడు జిల్లా, అమరావతి ఎస్ఆర్ఓ ప్రాంతం, అమరావతి మండలం, అమరావతి గ్రామం సర్వే నెం.256/ఎ-1ఎ2 నందు 129.6 చదరపు గజాల స్థలం. ఇందులో ఎల్&బి డోర్ నం.10-34/1, అసెస్మెంట్ సం.2764తో ఉన్న 380 చదరపు అడుగుల ఆర్‌సిసి భవనం యొక్క ఆస్తి మొత్తంగా. సరిహద్దులు: తూర్పు: మసీదుకు చెందిన ఆస్తి 37 అడుగులు, పడమర: షేక్ సుభానీకి చెందిన ఆస్తి 7 అడుగులు, ఉత్తరం: ఉమ్మడి మార్గం 4 అడుగులు, దక్షిణం: పటాన్ నాగుల్ మీరాకు చెందిన ఆస్తి 38 అడుగులు, మళ్లీ పడమర: ఉమ్మడి మార్గం 30 అడుగులు, మళ్లీ ఉత్తరం: షేక్ జానీ బాషాకు చెందిన ఆస్తి 34 అడుగులు.

ప్రదేశము : పల్నాడు
తేదీ : 19-05-2025

సం/- (అధీకృత అధికారి)
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

పొగాకు కొనుగోళ్లు జరపాలి..

ఐటీసీ కంపెనీ వద్ద 27న నిరాహార దీక్ష

రైతు సంఘాల నాయకులు వెల్లడి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పెద్దన్న పాత్ర పోషిస్తున్న ఐటీసీ కంపెనీతో పాటు అన్ని కంపెనీలు రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేయాలన్న డిమాండ్‌తో పట్టణంలో ఎన్.ఆర్.టి సెంటర్ వద్ద గల ఐటీసీ కంపెనీ వద్ద ఈ నెల 27వ తారీఖున నిరాహార దీక్ష చేయ బోతు న్నట్లు అన్ని రైతు సంఘాల నాయకులు మంగళవారం ప్రకటించారు. పండరీ పురంలో గల ఏలూరు సిద్దయ్య విజ్ఞాన భవన్‌లో కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. రాధాకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుసంఘం నాయకులు మాట్లా డుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా పడిన సంద ర్భంగా ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఒక చిల కలూరిపేట నియోజకవర్గంలోనే ఎక్కువ మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ చిన్న సన్నకారు, కౌలు రైతులు పొగాకును పండించారని, ఇప్పటికైనా కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రులు కంపెనీల చేత కొనిపిస్తామని చెప్పి జాడ, జవాబు లేదన్నారు. అంతే కాకుండా చిలకలూరిపేట ప్రాంతంలో సాగర్ కెనాల్ పొడిగించి అన్ని ప్రాంతాలకు ఒక పంటకు గ్యారంటీగా నీటిని అందించడా నికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పొగాకు కొను గోలు సమస్య తీవ్రంగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెంటనే పొగాకు బోర్డు పరిధిలోకి తేవాలన్నారు. ఉత్తర భారతదేశ రైతు ఉద్యమాలను దృష్టిలో పెట్టుకొని పొగాకు కొనుగోలు చేసే కంపెనీల వద్ద నిరసన కార్యక్రమాలు చేయాలన్నారు. గతంలో రెండు మూడు ఎకరాలు వేసి కౌలు రైతులు కంపెనీల మాటలు విని 10,15ఎకరాల దాకా కౌలుకు తీసుకొని వేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్ప టికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి పొగాకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, సీపీఐ ఏరియా ఇన్చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం చిలకలూరిపేట అధ్యక్షులు సాతు లూరి లూథర్, కాంగ్రెస్ పార్టీ నియోజ కవర్గ ఇన్చార్జి ఎం. రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏరి యా కార్యదర్శి మల్లికార్జున్, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు ఐద్వా పట్టణ పి.భారతి, ఎస్.ఎఫ్.ఐ పట్టణ అధ్యక్షులు పి శివ గణేష్, మున్సిపల్ యూనియన్ నాయకు లు అంజయ్య పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-అమరావతి: కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మంగళవారం అమరావతి సిపిఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతా వరణం కారణంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా పడిన నేపథ్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ, నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక , కర్షకు లకు నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని తెలిపారు. కార్మికులకు కార్మిక శాఖ ద్వారా సభ్యత్వాలను నమోదు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలిపారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, ముని, మంత్రాలు, వెంకటేశ్వరరావు, సామ్రాజ్యం, అంజమ్మ, వెంకటరత్నం, మాణిక్యం గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

విశాలాంధ్ర - వినుకొండ : ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పట్టణంలోని జూనియర్ కళాశాలలో తొలిరోజు సోమవారం ముప్పాళ్ళ చెన్నయ్య, రాపర్ల శ్రీనివాసరావు కళాప్రాంగణం లో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ జి లీలావతి జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, జీడిసిసి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు నటరాజ పూజ చేసి ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. నాటిక ప్రదర్శనలకు డివిఎల్పి మాజీ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, న్యాయవాది ముప్పాళ్ళ జ్ఞానేశ్వర్రావు, వారి కుటుంబ సభ్యులకు ప్రోత్సాహిక పారితోషికాన్ని అందజేశారు. సందేశాత్మ కంగా భార్య మాటలు విని కన్న ప్రేమను మరిచిన కొడుక్కి కళ్ళు జరిపించిన తల్లిదండ్రుల ఇతివృత్తంగా "కిడ్నాప్" నాటిక సాగింది. ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు కు చెందిన కళాకారులు పోటీపడి నటించారు. చెరుకూరి సాంబశివరావు దర్శకత్వం వహించారు. కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో "జనరల్ బోగీలు" నాటిక రైళ్లలో సామాన్య ప్రయాణికులు కష్టాలను కళ్ళకు కట్టింది. మాధవ్ రచించిన గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కౌన్సిలర్ షకీలా బేగం, పీవీ. సురేష్ బాబు, జనసేన పార్టీ నాగ శ్రీను రాయల్, మంద. మరియదాసు, గాలి. రేవతి శ్రీనివాసరావు, పెనుగొండ. శ్రీనివాసరావు, లాయర్. సైదారావు, తదితరులు పాల్గొన్నారు.

75 తాళ్లూరు సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శిగా సెగ్గం వెంకటేశ్వర్లు



విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని 75 తాళ్లూరు సీపీఐ శాఖ మహాసభ నిర్వహించినట్లు సీనియర్ సీపీఐ కార్యదర్శి చల్లపల్లి పానయ్య తెలిపారు. కార్యాల యం ముందు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల పురిటిగడ్డ సీపీఐ నిర్వహించే ప్రజా పోరా టాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన సీపీఐ శాఖ కార్యదర్శిగా సెగ్గం వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా దొడ్డ రాజు, చల్ల పల్లి పానయ్య, కే ఇశ్రాయేలు, ఈ శ్రీనివాసరెడ్డి, వీర రాఘవయ్యలను ఎన్నుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం

విశాలాంధ్ర-యద్దనపూడి: ఇటీవల మండలం లోని కారుచోల గ్రామంలో పిడుగు పాటుకు మరణించిన కుటుంబానికి ప్రభుత్వ సాయం అందింది. షేక్ పర్వీన్ మిర్చి కోతకు వెళ్లి వర్ష భీభత్సంలో పడిన పిడుగుకు అక్కడి కక్కడే మరణించింది. బాధిత కుటుంబానికి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చొరవతో ప్రభుత్వ తక్షణ సాయంగా 50 వేల రూపాయలు మంగళవారం అందించారు. నరసరావుపేట ఆర్డీవో మధులత సమ క్షంలో ప్రత్తిపాటి చెక్‌ను పర్వీన్‌భర్త జాన్‌సైదాకు అంద జేశారు. మిగతా నష్టపరిహారాన్ని కూడా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యద్దనపూడి తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, టిడిపి నాయకులు కామినేని సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

విశాలాంధ్ర-అమరావతి: ఎన్నికల సందర్భం లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను యుద్ధ ప్రాతి పదికన అమలు చేయాలని పెద్దకూర పాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మున గోటి శ్రీనివాసరావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లను డిమాండ్ చేశారు. మంగళ వారం అమరావతి మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో శాఖ మహాసభ జరిగింది. సభకు ఎ నాంచారయ్య అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఊబిలో కూరుకుపోయిన్న రైతాంగాన్ని ప్రభుత్వాలు ఆదుకో వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ మాట్లాడుతూ దేశం వెలిగిపోతుందని, సంవత్సరానికి నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం రెండు కోట్ల ఉద్యోగాలు రూపకల్పన చేయనున్నట్లు, రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని నమ్మబలికి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారం వైపు తీసుకెళ్లడంలో పూర్తి స్థాయిలో విఫలమైందని ఆరోపించారు. అటు రైతాంగం ఇటు కార్మికులు వ్యవసాయ కూలీలు అసంఘటిత కార్మికులు మధ్యతరగతి పేదరికంతో బాధపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార మార్గం వైపునకు తీసుకెళ్లడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో వైఫల్యం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను సృష్టించిన కార్మికులు, కర్షకులు అర్ధాకలితో జీవిస్తుంటే దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాధత్తం చేస్తూ విభిన్న వర్గాల మధ్య మత మారణ హోమం సృష్టిస్తూ ఇదే దేశాభివృద్ధి అని నమ్మపలుకుతున్న పాలక విధా నాన్ని ఎండగట్టేందుకు సీపీఐ నిర్వహించే ప్రజా ఉద్యమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. సమావేశంలో అమరా వతి మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, టి.వెంకటేశ్వర్లు, కె.ఏసు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు వెల్లువ

విశాలాంధ్ర-పొన్నూరు : మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పట్టణంలో కూటమి శ్రేణులతో పాటు మీడియా ప్రతినిధులు, వ్యాపార ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ సేవా సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. అతి తక్కువ కాలంలోనే పొన్నూరు పురపాలక సంఘంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు, త్రాగునీటి, డ్రైనేజీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ పురపాలక సంఘ ప్రజల మన్ననలను పొందిన ఏకైక కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అని కొనియాడారు. పూర్తికాల పదవిని పొన్నూరులో గడపాలని, మరిన్ని ప్రజా సమస్యలను పరిష్కరం చేందుకు కృషి చేయాలని కోరారు. పట్టణంలో పలువురు కార్యాలయంలో కలిసి శాలువా పుష్పగుచ్ఛాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు

విశాలాంధ్ర-తుళ్లూరు : తుళ్లూరు మండలం అనంతవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో నిర్వహితమవుతున్న ఈ ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్ల నిధులు కేటాయించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నిధుల కేటాయింపుకు ప్రధానంగా కృషి చేసిన టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావుకు అమరావతి రాజధాని పరిధిలోని రైతులు, మహిళలు, రైతు కూలీలు కృతజ్ఞతలు తెలుపుతూ శుభాభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధి ద్వారా ప్రాంతానికి ఆధ్యాత్మికాభివృద్ధితో పాటు పర్యాటక ప్రాధాన్యం కూడా పెరుగుతుందని వారు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి కృపతో ఆలయ అభివృద్ధి కార్యాలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని టీటీడీ వర్గాలు తెలిపాయి.

గ్రామాల్లో కిశోరి వికాసం

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో మంగళవారం ఐసిడియస్ ఆధ్వర్యంలో "కిశోరి వికాసం" కార్యక్రమం జరిగింది. మండలంలో రొంపిచర్ల, మునమాక, వడ్డమూడివారిపాలెం, మర్రిచెట్టుపాలెం, పరగటిచర్ల, నల్లగార్లపాడు, చాకలికుంట తండా గ్రామాలలో గల అంగన్వాడీ కేంద్రాలలో కిషోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు, గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, లింగవివక్షత, సమానత్వం పై అవగాహన కలిగించారు. బాలురు, బాలికలు ఇద్దరు సమానమేనని అన్నారు. లింగవివక్షత చూపరాదని అన్నారు.

త్వరలోనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : నియోజక వర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు, కాలువల్లో చెత్త పేరుకుపోకుండా డ్రైనేజి వ్యవస్థ శుభ్రం చేయడం వంటి పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని రాజీవ్ రజక కాలనీలో తాగునీటి పైప్ లైన్ పనులకు జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరా పథకం ద్వారా రూ.19.89 లక్షలతో 250 ఇళ్లకు సురక్షిత జలాలు సరఫరా చేసేలా పైప్ లైన్ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ పైప్ లైన్ ఏర్పాటుతో కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు దూరమవుతాయని తెలిపారు. ఇప్పటికే అమృత్ పథకంలో కాలనీలకు నీటి సరఫరా మెరుగుపరచడానికి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. త్వరలో అంతర్గత రోడ్లు, అంగన్వాడీ కేంద్రం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ కాలనీ ఏర్పాటు చేశామని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జీవీ ఆంజనే యులు కూడా ఈ కాలనీ ఏర్పా టుకు పూర్తిగా సహకరించారని, ఎంతోమంది ఎన్నో రకాలుగా అడ్డంకులు సృష్టించాలని చూసినా మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవడం తగదని ప్రోత్సహించిన ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

మంత్రితో యరపతినేని భేటీ

విశాలాంధ్ర - పిడుగురాళ్ల: నియోజకవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం సెక్రటేరియట్ నందు ఆయనతో ఎమ్మెల్యే ప్రత్యేక భేటీ అయ్యారు. గురజాల నియోజకవర్గంలోని పట్టణాల అభివృద్ధి గురించి చర్చించి, నిధులను కోరగా మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారన్నారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీలో సిసి రోడ్లు మరియు సైడ్ డ్రైన్ల నిర్మాణంకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. గురజాల మున్సిపాలిటీ పరిధిలో "మాచర్ల - గుంటూరు రోడ్డు"లో రోడ్డుకి ఇరువైపులా మెయిన్ డ్రైన్స్ మరియు అవుట్ ఫాల్ డ్రైన్స్ నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారు. అభివృద్ధి పనుల కోసం నిధులు కావాలని కోరగానే సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులను మంజూరు చేసినందుకు మంత్రికి గురజాల నియోజకవర్గ ప్రజల తరుపున ఎమ్మెల్యే యరపతినేని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యంలో అవినీతి-పరిష్కారాలపై 23న చర్చా గోష్టి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని రామన్నపేట ఒకటవ లైన్‌లో గల జనచైతన్య వేదిక హాలులో రేషన్ బియ్యంలో అవినీతి-పరిష్కారాలపై చర్చా గోష్టిని నిర్వహిస్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వక్తలుగా మాజీ శాసనసభ్యులు షేక్ మస్తాన్ వలి, మాజీ శాసనమండలి సభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, మాజీ శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటా ఆంజనేయులు తదితరులు ప్రసంగిస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు ఆహార భద్రతను కల్పించే రేషన్ బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ అవినీతిమయంగా మారిందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కొక్క మండలానికి ఒక ఏజెంట్‌ను నియమించి వారి ద్వారా పేదల నుంచి రేషన్ బియ్యాన్ని కిలో రూ.10ల నుంచి రూ.15లకు కొనిపిస్తున్నారన్నారు. మధ్య దళారీలు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ప్రతి నెలా మామూలు చెల్లిస్తూ రేషన్ బియ్యం సరఫరాను అవినీతిమయంగా మార్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని, 28936 రేషన్ డీలర్స్ పనిచేస్తున్నారని, ఆచరణలో పేదలు అందుకుంటున్న రేషన్ బియ్యంలో 5 శాతం కూడా కుటుంబ అవసరాలకు వినియోగించుకోకుండా కిలో బియ్యం రూ.10ల నుంచి రూ.15లకు మధ్య దళారీలకు అమ్ముతున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ, పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ఈ చర్చా గోష్టిని నిర్వహిస్తున్నట్లు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఒక అంచనా ప్రకారం అధికార పార్టీ ఎమ్మెల్యేలలో అత్యధికులు ప్రతి నెలా రూ.20 లక్షలకు పైగా రేషన్ బియ్యం అక్రమాల ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి అవినీతి నివారణకు సరైన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా ప్రజాస్వామ్యవాదులు, పౌర సమాజానికి జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ విజ్ఞప్తి చేస్తుందని అన్నారు.

23న పున్నమి చెరువు విచారణ

విశాలాంధ్ర-తాడికొండ : అడ్డ రోడ్డులోని ఆక్రమణల చెరలో ఉన్న పున్నమ్మ చెరువు విచారణ ఈ నెల 23వ తేదీన జరుగుతుందని సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్ రావు మంగళవారం తెలిపారు. ఈ నెల 21న జరగవలసిన విచారణ 23కు వాయిదా పడినట్లు తెలిపారు. తాడికొండ పంచాయతీ కార్యదర్శి హరిబాబు సెలవులో ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు శివశంకర్ రావు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి : ఎంపీపీ

విశాలాంధ్ర-దుర్గి: ప్రజాప్రతినిధులుగా మేము, అధికారులుగా మీరు కలిసికట్టుగా పనిచేసి మండల సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపిపి యేచూరి సునీత అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి సునీత అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు యేచూరి సాయి శంకర్ పాల్గొని మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఉపాధి హామీ పథకంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించి,ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయాలని కోరారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు అందజేయాలని ఎంపీడీఓ శివప్రసాద్ కు ఆయన సూచించారు. వేసవి కాలం పూర్తియ్యేవరకు గ్రామాల్లో త్రాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. మాచర్ల నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారం కోసం నర్సరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయులు రూ. 1200 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని,అటవీశాఖ అడ్డంకులు వలన శంకుస్థాపన ఆలస్యమైందని,త్వరలోనే అడ్డంకులను తొలగించి నాగార్జున సాగర్ వద్ద ఈ పథకానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులందరూ సమిష్టి కృషితో మన మండలాన్ని ముందుకు తీసుకెళ్దామని అన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్‌తో తప్పని ఇబ్బందులు

విశాలాంధ్ర-తుళ్లూరు: సీఎం వస్తున్నారంటూ పోలీసులు చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. ముఖ్యమంత్రి రావటానికి అరగంట ముందే బారికేడ్లు అడ్డుగా పెట్టి వాహనాలను ఎక్కడికక్కడ ఆపేస్తున్నారని సామాన్యులు సణుక్కు. అంటున్నారు. మంగళవారం కేబినెట్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంకు వచ్చారు. సిఎం కాన్వాయ్ సచివాలయం వెనుక వైపు రోడ్డు మార్గంలో గుండా వెళ్ళింది. ఉదయం 10.45 గంటలకు సిఎం సచివాలయంకు వస్తారని అధికారిక సమాచారం. పోలీసులు మాత్రం అరగంట ముందే మల్కాపురం వద్ద సచివాలయం వెనుక రోడ్డు వద్ద ప్రధాన రహదారికి అడ్డుగా బారికేడ్లు ఉంచారు. ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని వాహనాలను నిలిపివే శారు. దీంతో వాహనాలపై ప్రయాణిస్తున్న మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బంది పడ్డారు. విఐపిల రాక పోకలు నిత్యం సాగుతుంటాయని, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బ్యాంకర్లు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: బ్యాంకర్లు ఉదారంగా లబ్ధిదారులకు రుణాలు మంజూరుచేయాలని, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయులు బ్యాంక్ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయములో పి.జి.ఆర్.యస్ సమావేశ జనవరి-2025-మార్చి-2025 త్రైమాసికానికి సంబంధించి డి.సి.సి (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటి) మరియు డి.యల్.ఆర్.సి (డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటి) పై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని లబ్ధి దారులకు సులభంగా పథకాల పై అవగాహన కలిగించి లబ్ధి చెకూరవచ్చని అభిప్రాయ పడ్డారు. పి.యం.జే.జే. వై, పి.యం.జన.ధన యోజన వంటి పదకాలలో ఎన్ని యాక్టివ్ గా ఉన్నాయి, ఎన్ని ఇన్ యాక్టివ్ గా ఉన్నాయి వివారాలు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమములో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ .మాధురి తొలుత సమావేశం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ రాం ప్రసాద్ జనవరి-2025- మార్చి-2025 నాటి త్రైమాసిక నివేదికను పి.పి.టి ద్వారా వివరించారు. ఈ కార్యక్రమములో ఆర్.బి.ఐ అధికారి అబిషేక్ రాజ్, నాబార్డు డి.డి.యం సి.శరత్ బాబు, వివిధ బ్యాంకుల కో- ఆర్డ నేటర్లు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-మంగళగిరి: ద్విచక్ర వాహన చోదకులు, నాలుగు చక్రాల వాహనా లలో ప్రయాణం చేసే వారు విధిగా రోడ్డు భద్రత నిబంధ నలను పాటించాలని మంగళగిరి పట్టణ ఎస్సై రవీంద్ర నాయక్ సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న వాహన చలానాలను వసూలు చేసేందుకు పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాత బస్టాండ్ సెంటర్లో మంగళవారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత నిబంధనలను పాటించకుండా రాకపోకలు సాగించిన వారికి చలానాలు విధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, CHERIAN DOMI VADAYIL (Old Name), S/o. KURUVILLA CHERIAN, Resident of Flat No.102, Alekhya Avenue, 1st Line, Bhavani Nagar, Inner Ring Road, Gorantla, Guntur - 522034, Guntur District, Andhra Pradesh. I have changed my name as DOMI VADAYIL (New Name) S/o. KURUVILLA CHERIAN. Hereafter my name is known as DOMI VADAYIL (New Name) S/o. KURUVILLA CHERIAN.

ధరణికోట సీపీఐ శాఖ కార్యదర్శిగా ఎడ్లవల్లి సతీష్ కుమార్

విశాలాంధ్ర-అమరావతి: ప్రజా పోరాటాల పురిటి గడ్డ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయా ల్సిన అవసరం ఎంతైనా ఉందని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ధరణికోట సీపీఐ శాఖ మహాసభ సందర్భంగా జరిగిన సభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా ఎడ్లవల్లి సతీష్ కుమార్, సహాయ కార్యదర్శిగా సైతం సత్యనారాయణ కమిటీ సభ్యులుగా శాంసంగ్, పి.వెంకటేశ్వర్లు, మేడ మల్లేశ్వరి, టి.వెంకటేశ్వర్లు, జె.యుగంధర్, బి.శంకర్లతోపాటు 9 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మడలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్టాం రామకృష్ణ, అమరావతి మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మంగళవారం చిలకలూరిపేట పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్ సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చిలకలూరిపేట ఏఐటీయూసీ అధ్యక్షులు పేలూరి రామారావు మాట్లాడుతూ కార్మిక, కర్షకులకు నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని తెలిపారు. కార్మికులకు కార్మిక శాఖ ద్వారా సభ్యత్వాలను నమోదు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగభైరు రామసుబ్బాయమ్మ, శివకుమార్, తన్నీరు వెంకటేశ్వర్లు, బొంతా భగత్ సింగ్ ,షేక్ ఖాదర్ వలి, ఆరాధ్యుల రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ నాయకులు ఎన్. కృష్ణ, దాసరి లింగారావు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల సీపీఐ శాఖ కార్యదర్శిగా సామెల్ జాన్

విశాలాంధ్ర-రెంటచింతల: రెంటచింతల గ్రామానికి సంబంధించిన శాఖ సమావేశాన్ని మంగళవారం రెంటచింతల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రెంటచింతల శాఖ సెక్రెటరీ అమరారపు సామెల్ జాన్, జాయింట్ సెక్రెటరీ మామిడి లాజర్, 7 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అదే విధంగా 20 మంది సభ్యత్వ నమోదు చేసుకున్నారన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ వారు పార్టీ ఆదేశానుసారం పనిచేయాలని, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలనీ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కేతావత్ రంగానాయకులు, కమిటీ సభ్యులు దేగల యెలిశా, తక్కెళ్ళపల్లి మల్లయ్య, బీసీపోగు మోషా, దేగల జాను, మామిడి యేసమ్మ తదితర్లు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీగా నిరసనలు

విశాలాంధ్ర-నరసరావుపేట: ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు కాసా రాంబాబు. ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాల్ని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ అధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో ఆదాని అంబానీలకు దేశ సంపదను దారాదత్తం చేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలను తెగ నమ్ముతుందని, బడా పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షల కోట్ల రద్దు చేశారని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ కూలీలకు 200 వందల రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు చక్రవరం సత్యనారాయణ రాజు, శ్రీనివా సరెడ్డి. అంజ య్య, ఏఐటీయూసీ నాయకులు ముప్పల కోటేశ్వరరావు, రామారావు. డేవిడ్. సాంసంగ్. రాంబాబు, గౌస్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, యాకోబు, సిఐటియు జిల్లా నాయకులు గుంటూరు విజయ్ కుమార్, శివకుమారి, జి.మల్లేశ్వరి, సిలార్ మసూద్ పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న సీపీఐని గ్రామీణ ప్రాంతాలలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పెద్దకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని 75 తాళ్లూరు సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాఖ మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సభకు సీనియర్ చల్లపల్లి పానయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనకబడిన వర్గాలతో పాటు రైతాంగం రైతు కూలీ కార్మికులు అసంఘటిత కార్మికుల జీవన విధానం మెరుగుపడే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజలు ఎదుర్కొనే మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం సీపీఐ ప్రజా ఉద్యమాలలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు చల్లపల్లి పానయ్య, సిగ్గం వెంకటేశ్వరరావు, దొడ్డ రాజు ఇశ్రాయేలు, ఈ శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం నాయకుడు అడపాల వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను హరిస్తున్న పాలకులు: బూదాల

విశాలాంధ్ర-వినుకొండ : ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో ఏఐటియుసి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన దగ్గర నుండి కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా కుదించటం, అలాగే కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంలో కూడా ప్రభు త్వాలు వైఫల్యం చెందటం, ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖ ఉక్కును ప్రైవే టీకరణ చేయడం కోసం పన్నాగాలు పొందటం, విశాఖ ఉక్కులో పని చేస్తున్న వివిధ రంగాల కార్మికులను తొలగించటం దారుణమని అన్నారు. దేశంలో రైతులకు గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులకు గురి చేయటం, కార్మిక హక్కులను కాలరాస్తూ బిజెపి కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, వీటికి వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండ్రముట్ల సుభాని, రాయబారం వందనం, కొప్పెరపు మల్లికర్జున, ఎస్కే మస్తాన్, వెంకటేశ్వర్లు, సుభాని తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి: కార్మి కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరిలో మంగళవారం ఏఐటీయూసీ,సీఐటీయూ, వైఎస్సార్ టీయూ, ఏఐఎఫ్టియూ న్యూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్య క్రమాన్ని చేపట్టారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యానా రాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, వైయస్సార్ టి యు నియోజకవర్గ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరాజు, ఏఐఎఫ్టియూ న్యూ నాయకులు కె కోటేశ్వరరావు మాట్లా డుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రైతాంగ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తే, దేశవ్యాప్తంగా కార్మి కులు ఇబ్బందులకు గురవుతారని అన్నారు. పని గంటల భారం పది గంటల నుండి 12 గంటల వరకు పెరుగుతుందన్నారు. కార్మికులను ఇబ్బందులు పాలు చేసి, యాజమాన్యానికి అనుకూలంగా లేబర్ కోడ్ లను తీసుకురావడం దుర్మార్గ మని విమర్శించారు. వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు రూ.26వేలు అమలయ్యే విధంగా చర్యలు తీసు కోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, వైఎస్సార్‌టియు నాయకులు కే తిరు మలేశ్వరరావు, డి అమరేశ్వర రావు, ఏఐఎఫ్టియు న్యూ నాయకులు వి దుర్గాప్రసాద్, ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వందేళ్లైనా వన్నె తగ్గని ఎర్రజెండా

విశాలాంధ్ర-అమరావతి: వంద సంవత్సరాలైన వన్నె తగ్గని ఎర్ర జెండా అని, సీపీఐ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కమ్యూనిస్టు భావజాలాన్ని పునికి పుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. ధరణికోట సీపీఐ శాఖ మహాసభ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అమరావతి మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు మాట్లాడుతూ పేదల ఆశా జ్యోతి ఎర్రజెండా అని, వారి హక్కుల కోసం నిరంతరం శ్రమించే ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర్లు, యుగంధర్, గాలం సాంబశివరావు, బి.వేదాంతం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలోని రక్త బ్యాంకు లలో రక్త నిల్వలు పూర్తి స్థాయిలో లేనందున రక్త నిల్వలు పెంచేందుకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయములోని పి.జి.ఆర్.ఎస్ హాలులో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ రక్త సేకరణను జిల్లాలోని వివిధ శాఖల సిబ్బందితో ప్రారంభించారన్నారు. తాను రంప చోడవరంలో పని చేసేటప్పుడు బ్లడ్ బ్యాంకులు ఉన్నప్పటికీ రక్త నిల్వలు ఉండేవి కాదని అదే పరిస్థితిని ఇక్కడ చూశానని అన్నారు. యువత ముందుకు వచ్చి విరివిగా రక్త దానం చేయాలని, రెడ్ క్రాస్ సంస్థ చేపట్టిన రక్త దాన శిబిరాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి మురళి, అధికారులు, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయితీ పై పశుగ్రాస విత్తనాలు

విశాలాంధ్ర- దుర్గి: 75శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు దుర్గి పశువైద్యాధికారి డా.దిలీప్ మంగళవారం తెలిపారు. 5 కేజీల సంచి రాయితీపై రూ. 115లు చెల్లించాలన్నారు. ఎకరానికి 20 కేజీలు సరిపోతాయన్నారు. 45 రోజులకు మొదటి కోత వస్తుందని, పశువులకు ఊంగిడి తగలదని చెప్పారు. నీటి సౌకర్యం ఉన్న పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల ముందు నుండే యోగా పై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. జూన్ 21 న ప్రధాని మోదీ విశాఖపట్నంలో పాల్గొంటారని, ఈ కార్యక్రమం లైవ్ ద్వారా ప్రసారం జరుగుతుందని, ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తూ యోగా చేసేలా ఏర్పాట్లను గావించాలని అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అరుణ్ బాబు జిల్లా అధికారులు , మండల అధికారులు , గ్రామ స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలను జారీ చేసారు. ఈ నెల 21 నుండి కాంపెయిన్ ప్రారంభం అవుతుందని, యోగా చేయడం పై ప్రజలలో చైతన్యం కలిగించి, ప్రతి ఒక్కరూ యోగాభ్యాసనం లో పాల్గొనేలా చేయాలనీ తెలిపారు.

అమెరికాకు దేశ సార్వభౌమాధికారాన్ని పణంగా పెట్టిన మోడీ సర్కార్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అమెరికా పాలకులకు బానిసగిరి చేయొద్దనీ, ఫహల్గామ్ "టెర్రరిస్టు" దాడి పై ఉన్నత స్థాయి విచారణ జరిపి నిజాల్ని బహిర్గతం చేయాలనీ, ఆపరేషన్ సిందూర్ పట్ల అన్ని వాస్తవాల్ని దేశ ప్రజల ఎదుట వెల్లడి చేయాలనీ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు.సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్ లో బహిరంగ సభ పార్టీ రాష్ట్ర నాయకులు కె పొలారి అధ్యక్షతన నిర్వహించారు.ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ పెహల్గావ్ టెర్రరిస్టు దాడిపై మోడీ సర్కార్ ఇంతవరకు విచారణకు ఆదేశించకపోవడం సరికాదన్నారు. పహల్గావ్ లో సీసీ కెమెరాలు లేవని, ఆ ప్రాంతంలో సైన్యాన్ని ఉపసంహరించారనీ అందుకు కారణాలు చెప్పాలని అడిగారు. పాక్ ఉగ్రవాదులు దేశ సరిహద్దు దాటి 120 కిమీ ఎలా వచ్చారన్నారు.పైగా దాడి చేసి ఎలా వెళ్లారని ప్రశ్నించారు.ఈ సందేహాలు ప్రజలలో కల్గిస్తున్నాయన్నారు. వీటిని నివృత్తి చేసే భాధ్యత కేంద్రానిదే అన్నారు. మరో వక్తగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుద్ధం వద్దన్నం దుకు, శాంతి కోరినందుకు అనేకమంది దేశభక్తులకి దేశద్రోహులని ముద్రలు వేసి ఇబ్బంది పెట్టారని, యుద్ధం వద్దని ట్రంప్ చెబితే అది గొప్ప దేశభక్తిగా మారిందని ఎద్దేవా చేశారు. పహల్గావ్ టెర్రరిస్టుల దాడితో దేశమంతా విషాదంలో కూరుకొని పోయిన సమయంలో బాధితుల్ని ఓదార్చే కృషి వదిలేసి మోడీ బీహార్ ఎన్నికల సభకు పోవడం బాధ్యతా రాహిత్యమని అన్నారు. నగర కార్యదర్శి పి పద్మ మాట్లాడుతూ పహల్గావ్ టెర్రరిస్టుల దాడిని మత కోణంలో చూడరాదని అన్నారు. దాడిలో భర్తలను, తండ్రులను పోగొట్టుకున్న బాధితులు కూడా దాడుల సమయంలో కాశ్మీర్ ముస్లింలు తమకు అనేక విధాలుగా సహాయపడ్డారని ప్రకటించడం దేశంలో మత సామరస్యతకు నిదర్శనం అన్నారు.పహల్గావ్ టెర్రరిస్టుల దాడి ఘటనపై అన్ని కోణాలలో సమగ్ర విచారణ జరిపించాలని, ఆపరేషన్ సింధూర్ పూర్తి విషయాలను దేశ ప్రజల ముందు ఉంచాలని, యుద్ధం వద్దనీ, శాంతి కావాలనీ, అమెరికాకు లొంగివుండే విధానాల్ని వదులుకోవాలన్నారు..ఈ సభలో కార్మిక సంఘాల, ఉద్యమ శ్రేణులు సాహిత్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం పెదసనగల్లులో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిసప్తాదశ (17వ) వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం తో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సుప్రభాత సేవ, నిత్యార్చన, నిత్య హోమము,బలిహరణ, అనంతరం వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ నిర్వహించారు. సాయంత్రం ధ్వజ అవరోహణ, ద్వాదశప్రదక్షణలు,పవళింపు సేవ, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. శ్రీ వైఖానస ఆగమరీత్యా నిర్వహించిన ఈ కార్యక్రమాలను శ్రీ వైఖానస ఆగమ ప్రవర దీవి ఉదయకుమార అయ్యగారు(పెనుమూడి) బ్రహ్మత్వంలోఆస్థాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరిగిన ఈ కళ్యాణ వేడుకలకు దేవస్థాన పాలకమండలి, దేవస్థాన అభివృద్ధి సంఘ కేంద్ర కార్యవర్గం సభ్యులు గ్రామస్తులతో పాటు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం' వేసవి తరగతులు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం నిడుమోలు సెక్టార్ పరిధిలోని ముత్రాసుపాలెం, మొవ్వ సెక్టార్ పరిధిలోని కాజ-5 వ నెంబర్ అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం కిశోరివికాసం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌమార దశలో ఉన్న కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చైల్డ్ హెల్ప్ లైన్, బాల్య వివాహాల వలన కలిగే అనర్ధాలు, సమతుల ఆహారం , రుతు క్రమం పరిశుభ్రత మరియు లైంగిక విద్య,కౌమారదశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆ కార్యక్రమాలలో ఆయా సూపర్వైజర్స్ ఏనుగు పుణ్యవతి (మొవ్వ)అబ్దుల్ సలీమున్నిసా (నిడుమోలు), అంగనవాడివర్కర్స్, ఆశా వర్కర్స్ కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-చల్లపల్లి : జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం చల్లపల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్ చిత్రాలతో కూడిన జెండాలను చేతబట్టుకుని ర్యాలీ చేశారు. బాణాసంచా పేల్చి సందడిచేయటంతోపాటు స్థానిక సాగర్ థియేటర్లో యమదొంగ సినిమా ప్రదర్శన సందర్భంగా కేక్ కట్చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు కేక్ కట్చేయగా, కళాకారుడు బోలెం రామారావు పెద్ద ఎన్టీఆర్ వేషధారణలో అలరించారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ తదితరులు పాల్గొన్నారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నేతలు ముమ్మనేని సన్నీ, ఉప్పాలస్వామి, ప్రమోద్ తారక్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

కేబీఎన్‌లో ఉచిత దంతవైద్య శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కేబీఎన్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త నిర్వహణలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సిబార్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (గుంటూరు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు 500 మందికి ఉచితంగా దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. చిగుళ్ళ నుంచి రక్తం స్రావం జరగటం, పిప్పి పండ్లు, ప్రమాదాల కారణంగా విరిగిన పండ్లు తదితర సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేసి, విద్యార్థులకు మందులు ఇచ్చారు. తొలుత జరిగిన సమావేశంలో ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ దంత సమస్యలు కేవలం వృద్ధాప్యంలో వస్తాయనే భావన చాలామందిలో ఉందని, అది పూర్తిగా అపోహ అన్నారు. సమస్య తొలిదశలో అశ్రద్ధ చెయ్యటం వల్ల దంతాలు తీసే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. దంతాల సమస్యలకు చిట్కా వైద్యం చెయ్యటం ఉత్తమం కాదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ కొన్నిసార్లు దంత సమస్యలు ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని, అవగాహనతో ప్రాథమిక దశలోనే సమస్యలు నివారించుకోవాలని సూచించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, పి.ఎల్.రమేష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డి.పవన్, ఎన్.సాంబశివరావు, గౌతమిదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించిన 'వి'

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు దిగ్గజ టెలికం సంస్థ వి, 2024-25 ఆర్థిక సంవత్సరం ఆరు నెలల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా లక్షకు పైగా టవర్లను ఏర్పాటు చేసిన మైలురాయిని అధిగమించిన సందర్భంగా తమ కొత్త ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. తమ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో వేగవంతంగా విస్తరించడం, పటిష్టపర్చుకోవడంలో 'వి' నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుంది. నెట్‌వర్క్‌ను పటిష్టపర్చుకున్న విషయాన్ని సరికొత్తగా, ఆకట్టుకునే విధంగా తెలియజేసే దిశగా సరికొత్త నెట్‌వర్క్ అవతార్‌లు ది నెట్టీస్ తో 'వి' క్యాంపెయిన్ రూపొందించింది. మొబైల్ టవర్స్ స్ఫూర్తితో యానిమేటెడ్ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయి. ఐపీఎల్ సందడి నెలకొన్న సందర్భంగా ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్లేయర్లతో అత్యంత బలమైన టీమ్‌ను ప్రతిబింబించేలా ఈ అవతార్‌ల జట్టు ఉంటుంది.

ఏపీలో ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించిన కింగ్‌ఫిషర్ బీర్

విశాలాంధ్ర-విజయవాడ:- తయారీదారులు, వినియోగదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, కింగ్‌ఫిషర్ బీర్ యొక్క నిరంతర లభ్యతను నిర్ధారించడానికి హీనెకెన్ కంపెనీలో భాగమైన యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యుబిఎల్) ఆంధ్రప్రదేశ్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించింది. కంపెనీ కార్యకలాపాల విస్తరణ పై యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జోర్న్ కెర్షన్ మాట్లాడుతూ మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలు , తక్కువ ఆల్కహాల్ పానీయాలకు అనుకూలంగా ఉండే నియంత్రణ మార్పులకు అనుగుణంగా ఈ విస్తరణ రాష్ట్రంలో యుబిఎల్ ఉనికిని మరింతగా విస్తరింప చేస్తుందన్నారు.

పీక్ సీజన్లలో పెరిగే డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీని సిద్ధంగా ఉంచుతుందన్నారు. యుబిఎల్ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలంలో సొంత యాజమాన్యంలోని బ్రూవరీని నిర్వహిస్తోందని, దాని ప్రాంతీయ కార్యకలాపాలను మరింత విస్తరించటానికి సరఫరా చైన్ చురుకుదనాన్ని పెంపొందించడానికి కంపెనీ ఐలియోస్ బ్రూవరీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి అదనపు సౌకర్యం ను లీజుకు తీసుకొందని చెప్పారు.

ఈ విస్తరించిన సామర్థ్యం దీర్ఘకాలిక వృద్ధికి తోడ్పడుతుందని , ఆంధ్రప్రదేశ్ అంతటా పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మా కార్యకలాపాలను విస్తరించడానికి తాము ఆసక్తిగా ఉన్నామని, మా వినియోగదారులకు వారికి ఇష్టమైన బీర్‌ను మరింత మెరుగ్గా అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రాలో మా ఉత్పత్తి విస్తరణ కింగ్‌ఫిషర్‌ను ఇష్టపడేవారి పట్ల మా బీర్ల పోర్ట్‌ఫోలియో పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సులభంగా లభించేలా అధిక-నాణ్యత కలిగిన, స్థానికంగా తయారుచేసిన బీరును అందించడానికి మేము అంకితభావంతో కృషి చేస్తున్నామన్నారు. ఈ కొత్త సౌకర్యం రాష్ట్రంలో తమ దీర్ఘకాలిక వృద్ధి ఆశయాలను పెంపొందించడంతో పాటు వినియోగాన్ని ప్రోత్సహించే ప్రాధాన్యత ఎంపికగా బీర్‌ను ఉంచడం ద్వారా బీర్ విభాగాన్ని రూపొందించడంలో యుబిఎల్ యొక్క విస్తృత వ్యూహానికి అనుగుణంగా ఉంటుందని చెప్పారు.

బ్రావియా కొత్త టెలివిజన్ సిరీస్‌తో కొత్త శకాన్ని ఆవిష్కరించిన సోనీ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తమ టీవీలను అప్‌గ్రేడ్ చేసుకోవాలనుకునే వారికి వినోద అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించబడిన 4కె అల్ట్రా హెచ్డి ఎల్ఈడి డిస్ప్లే సాంకేతికతను కలిగి ఉన్న బ్రావియా 2 2 సిరీస్‌ను సోనీ ఇండియా పరిచయం చేసింది. గూగుల్ టీవీతో అనుసంధానించబడిన ఈ టీవీ, వినియోగదారులు విస్తృత శ్రేణి యాప్‌లు, స్ట్రీమింగ్ సేవలు, లైవ్ టీవీ ఛానెల్‌లను సులభంగా యాక్సెస్ చేయడానికి అనుమతిస్తుంది. సోనీ యొక్క కొత్త బ్రావియా 2 2 సిరీస్ 108 సెం.మీ (43), 126 సెం.మీ (50), 139 సెం.మీ (55), 164 సెం.మీ (65), 189 సెం.మీ (75) స్క్రీన్ పరిమాణాలలో అందుబాటులో ఉంది.